నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. జై భవానీ, మీనాక్షీ, సాతంరాయి ఫీడర్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాతంరాయి ఇండస్ట్రియల్ ఏరియా, జై భవానీ గల్లీ, గోద్రేజ్ రామ్‌కీ రోడ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వివరించారు.

నేడు గ్యార్వీ వేడుకలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎంఈఓ కార్యాలయం సమీపంలోని దర్గాలో ఆదివారం గ్యార్వీ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ముస్తాఫా తెలిపారు. ప్రతి సంవత్సరం గ్యార్వీ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ వేడుకలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వేడుకలతో పాటు అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎంజీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



రామకృష్ణ

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బుర్ల రామకృష్ణకు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బయోగ్యాస్, కాటన్ సీడ్ అయిల్, డైథైల్ ఈథర్ మిశ్రమంతో ఎల్‌హెచ్‌ఆర్ సీఆర్‌డీఐ ఇంజన్‌పై ఉద్గార లక్షణాల ప్రయోగాత్మక పరిశోధన ను అనుమతించి ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్శిటీ మెకానికల్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ పి.ఉషాశ్రీ పర్యవేక్షణలో పరిశోధన చేసి థీసిస్‌ను సమర్పించారు. రామకృష్ణకు డాక్టరేట్ రావటంతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆయనను శనివారం కళాశాలలో అభినందించారు.

పోగొట్టుకున్న మొబైల్ బాధితుడికి అప్పగింత



తమిళనాడు ప్రయాణికుడికి ఫోన్ అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ కనకయ్య

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తమిళనాడుకు రాష్ట్రానికి చెందిన నితేష్ కన్నా శనివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. టెర్మినల్ దాటి బయటికి వస్తున్న సమయంలో అతడి ఖరీదైన మొబైల్ ఫోన్ కనిపించకపోవడంతో వెంటనే ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి ఫోన్ స్వాధీనం చేసుకుని ఇన్‌స్పెక్టర్ కనకయ్య బాధితుడికి అందజేశారు. పోలీసులు స్పందించిన తీరుపై బాధితుడు హర్షం వ్యక్తం చేశారు. బాధితులు ఎవరైనా వెంటనే ఫిర్యాదు చేస్తే వేగవంతమైన పరిష్కారానికి పోలీసులు కృషి చేస్తారని ఇన్‌స్పెక్టర్ కనకయ్య స్పష్టం చేశారు.

మూడు కార్లు ఢీ కొని మహిళకు గాయాలు

మణికొండ: ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న రెండు కార్లతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని మరో కారు ఢీ కొట్టడంతో బైక్‌పై వెనుక కూర్చున్న మహిళకు తీవ్రంగా గాయపడిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మై హోం అవతార్ వద్ద శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మైహోం అవతార్ సర్కిల్ వద్ద శనివారం సిగ్నల్ పడటంతో అన్ని వాహనాలు ఆగాయి. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన బీఎండబ్ల్యూ (టీఎస్27ఎఫ్ 0046) కారు వేగంగా వచ్చి ముందు నిలుచున్న (ఏపీ31 బీకే7667), (టీఎస్ 07కేబీ 2169) కార్లతో పాటు బైక్ (టీఎస్ 08కేఏ 3022)లను ఢీకొట్టాడు. దాంతో రెండు కార్లు దెబ్బతినగా బైక్ పై వెనుక కూర్చున్న మహిళకు తీవ్రగాయాలయ్యాయి. గాయాల పాలైన మహిళను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమై బీఎండబ్లు కారు డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. ప్రమాదం జరిగిన కారు(ఏపీ 31బీకే 7667) యజమాని గోవిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భారీ వాహనాలతో దడ

- ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- ఇదేమని ప్రశ్నిస్తే గొడవకు వస్తున్న డ్రైవర్లు
- తరచూ తప్పని ట్రాఫిక్ సమస్యలు
- పాదచారులు, వాహనదారులకు తప్పని కష్టాలు
- పట్టించుకోని అధికారులపై సర్వత్రా నిరసన



చింతల్‌మెట్-కిషన్‌బాగ్ రహదారి పక్కన ఇష్టారాజ్యంగా ఆపిన భారీ వాహనాలు



శాస్త్రిపురం: అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్న భారీ వాహనాలతో సులేమాన్‌నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయ పాలన లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటం.. తద్వారా నిత్యం ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

- సులేమాన్‌నగర్ డివిజన్‌లోని చింతల్‌మెట్ నుంచి కిషన్‌బాగ్ వెళ్లే రహదారిపై ఎప్పుడు భారీ వాహనాలు ఆపుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. ఓ వైపు భారీ వాహనాల రాకపోకలు... మరోవైపు రహదారి పొడవునా భారీ వాహనాల పార్కింగ్‌తో తరచూ రోడ్డుపై ట్రాఫిక్ జాం నెలకొంటుంది. ఎన్ని సార్లు వాహనాలను పార్కింగ్ చేయవద్దని చెప్పినా వాటి డ్రైవర్లు కనీసమైన స్పందించడం లేదని.. అదేమంటే తరచూ గొడవలకు దిగుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోక పోవడంతో రోజుల తరబడి భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారులు నడవడానికి ఇబ్బందిగా ఉంటుందని ఎంఎం పహాడీ ప్రజలు వాపోతున్నారు.
- చింతల్‌మెట్, సెట్విన్‌కాలనీ, మీరాలం పార్కు, సులేమాన్‌నగర్, దర్గా తదితర ప్రాంతాలతో రహదారి పొడవునా భారీ వాహనాల పార్కింగ్‌లతో నిండిపోతోందంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. రోజులు తరబడి పార్కింగ్‌తో ఆయ ప్రాంతాలన్నీ చెత్త కుండీలుగా మారుతున్నాయి.
- పార్కింగ్ కారణంగా జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు వాటి కింద పడిన చెత్తను సైతం శుభ్రం చేయలేక పోతున్నారు. స్థానికంగా జరుగుతున్న వ్యాపారుల కోసం భారీ వాహనాలు వస్తున్నాయని ఉదయం వేళ కాకుండా రాత్రి వేళలో భారీ వాహనాలను తీసుకురావాలని చెప్పినా వ్యాపారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు సరుకులు తీసుకొచ్చే గూడ్స్ వాహనాలను సైతం రాత్రి వేళల్లో ఇక్కడ పార్కింగ్ చేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. భారీ వాహనాలు... కంటైనర్ల కారణంగా నిత్యం రోడ్డుపై ప్రమదాలు జరుగుతున్నా సంబంధిత పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- చింతల్‌మెట్ నుంచి కిషన్‌బాగ్‌కు వెళ్లే రహదారిపై భారీ వాహనాల కోసం ఒక సమయం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత పోలీసు అధికారులు భారీ వాహనాల రాకపోకలపై కఠినంగా వ్యవహరించాలని, రాత్ర వేళల్లో రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లివచ్చే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు పక్కనే భారీ వాహనాలను పార్కింగ్ చేస్తుండంతో వాటి చాటున తాగు బోతులు తమ కార్యకలపాలను సాగిస్తున్నారు. ఇకనైనా సంబంధిత ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకొని భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌లను అరికట్టలని సులేమాన్‌నగర్ డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కోట్లాది రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ సాయివాల్మీకి నగర్ కాలనీ వాసులు సమస్యలను ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కి ట్యాగ్ చేశారు. విషయం తెలుసుకున్న నాయకుడు హరీష్‌గౌడ్ చొరవతో కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యేను కలిశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కమిషనర్‌కు ఫోన్ చేసి వీలైనంత త్వరగా వారి రోడ్డు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ట్వీట్ చేసిన రెండు రోజుల్లోనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్లామని తెలియజేస్తూ సమస్య తమ దృష్టికి సోషల్ మీడియా వేదిక ద్వారా వచ్చిన కూడా అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని ఆయన తెలిపారు. ఇది వరకే రూ. 100 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. స్థానిక నాయకులు హరీష్‌గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ కరుణాకర్‌రెడ్డి, బాలాజీ, లోకేష్, రాజశేఖర్‌గౌడ్, సూర్యప్రకాష్, రాకేష్, అనిల్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయ నాయకుడు ఇంద్రన్న



ఇంద్రారెడ్డికి నివాళులర్పిస్తున్న కార్తీక్‌రెడ్డి



గండిపేటలోని నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లాలో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజా నాయకుడు స్వర్గీయ మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి అని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి అన్నారు. శనివారం ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా డైరీఫామ్ చౌరస్తాలో సీనియర్ నాయకుడు కొలన్ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంద్రారెడ్డి చిత్రపటానికి రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... తరాలు మారినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఘనత ఇంద్రారెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు అండగా నిలిచిన ఇంద్రారెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ప్రజల కోసం తమ కుటుంబ తలుపులు తెరిచే ఉంటాయన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తుదిశ్వాస వరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించిన ఇంద్రారెడ్డి ప్రజల మనసుల్లో ఎప్పటికీ అమరులేనని స్పష్టం చేశారు. నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఎస్.వెంకటేశ్, ముఖరం ఖాన్, జహీరుద్దీన్, జాలిగం చిత్తారి, రాము యాదవ్, అప్పారెడ్డి, ముఖేశ్, కొత్త రాజశేఖర్ రెడ్డి, రమేశ్ చారి, జీవన్‌దాస్, బద్దం శ్రీకాంత్ రెడ్డి, సూర్యం, దుర్గేశ్, రఘు యాదవ్, రాజేశ్ యాదవ్, లక్ష్మణ్, శ్రీవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, నయీమ్, కొంపల్లి జగదీష్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి సేవలు మరవలేనివి

మణికొండ: మాజీ మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి సేవలు మరవలేనివని బీఆర్‌ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గండిపేటలోని ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు, ఇంద్రారెడ్డి అభిమానులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం ఉన్న రాజకీయనాయకులంతా ఆయన శిష్యులుగానే ఎదిగారన్నారు. ఆయన రాజకీయ చతురతను అందరికీ నేర్పించి రాజకీయాల్లో రాణించేలా తీర్చిదిద్దారన్నారు. నియోజకవర్గ మైనార్టీ ఇంచార్జి ముక్తార్‌పాషా, నాయకులు సయ్యద్ నిజాముద్దీన్, వరదాచార్యులు, ముత్యాలు, మల్లేష్, చిరంజీవి, విష్ణువర్ధన్, శ్రీకాంత్‌రెడ్డి, సయ్యద్, మహేష్, ప్రియదర్శిని, రఫిక్, ప్రవీణ్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

మా చిన్నారికి ప్రాణ భిక్ష పెట్టరూ...

- దాతల సాయం కోసం తల్లిదండ్రుల వేడుకోలు
- ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో వెంటిలేటర్‌పై పోరాడుతున్న చిన్నారి హర్షిణిగౌడ్
- ఇప్పటి వరకు రూ. 22 లక్షల ఖర్చు



ఆస్పత్రిలో చిన్నారితో తల్లిదండ్రులు

మైలార్‌దేవ్‌పల్లి: మధ్య తరగతి కుటుంబానికి చెందిన దంపతులకు పెద్ద కష్టం వచ్చింది. వారికి రెండున్నర సంవత్సరాల చిన్నారి ఆడుకునే వయస్సులో ఆస్పత్రిలో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతోంది. తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. చిన్నారికి ప్రాణ భిక్ష పెట్టండని వేడుకుంటున్నారు. గడిచిన నెల రోజులుగా వెంటిలెటర్‌పై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీకి చెందిన రాసరి ప్రశాంత్ గౌడ్, రజిని గౌడ్ దంపతులు. వీరికి రెండున్నర సంవత్సరాల రాసరి హర్షణిగౌడ్ కూతురు. ఇటీవల తమ కూతురుకి జ్వరం రావడంతో కాటేదాన్ ప్రాంతంలోని జయదేవ్ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లారు. మూడు రోజులు అక్కడి ట్రీట్‌మెంట్ చేశాక సరైన చికిత్స అందించలేక చేతులెత్తేశారు. దీంతో తల్లిదండ్రులు సిటీలోని బటర్‌ఫ్లై ఆస్పత్రికి తీసుకేళ్లారు. అక్కడ టెస్టులు చేశాక లంగ్ ఇన్‌ఫెక్షన్ ఉన్నదని అన్నారు. చికిత్స చేస్తుండగా రెండు సార్లు హార్ట్‌ఎటాక్ వచ్చింది. రోజురోజుకూ పాప కండిషన్ ఆందోళనకరంగా మారింది. అప్పటికే రూ. 10 లక్షలు ఖర్చు చేశారు. వెంటిలేటర్‌పై ఉన్నది ఎలాగైన చిన్నారిని బతికించుకోవాలని బంజరాహిల్స్‌లోని రెయింబో ఆస్పత్రిలోకి మార్చారు. అక్కడి రోజూ లక్ష రూపాయలు ఖర్చు వస్తున్నది. ఇప్పటి వరకు రూ. 22 లక్షల రూపాయలు ఖర్చు అయ్యిందని తండ్రి పేర్కొన్నారు. మధ్య తరగతి కుటుంబం కావడంతో డబ్బును సమకూర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పడు మెదడులో నీరు రావడంతో చిన్నారికి ఆపరేషన్ చేసి వెంటిలేటర్‌పై ఉన్నది. దాతల సాయం కోసం అర్థిస్తున్నారు. సమాజంలో మంచి మనస్సు, దయాగుణం, మానవత్వం కలిగిన వారు తమ కుమార్తెను కాపాడాల్సిందిగా అర్థిస్తున్నారు. తమకు తోచిన సాయం అందించి వారి పాపను కాపాడలన్నారు. వివరాలకు ఫోన్: 80742 28166లో సంప్రదించాలని కోరుతున్నారు.

పెయిన్ స్కేప్-2025 సదస్సు ప్రారంభం



రాయదుర్గం: అన్ని రకాల నొప్పులను మర్చిపోయేలా 'ఎక్స్‌ఆర్' అనే సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించినట్లు కిమ్స్ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని కిమ్స్ ఆస్పత్రిలో 'పెయిన్ స్కేప్-2025' పేరిట నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని శస్త్ర చికిత్సల వల్ల దీర్ఘకాలం పాటు నొప్పి ఉంటుందని, కొన్నిసార్లు కండరాల నొప్పి వస్తుందన్నారు. క్యాన్సర్ చికిత్స వల్ల నరాల్లోనూ, మెడ, తలనొప్పి లాంటివి వేధిస్తుంటాయన్నారు. గర్భిణుల ప్రసవ నొప్పులకు పరిష్కారంగా ఈ ఎక్స్‌ఆర్ టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రి అసోసియేట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అంకిత ఆర్ చావ్లా మాట్లాడుతూ రోగులకు ఎక్స్‌ఆర్ టెక్నాలజీ హెడ్ సెట్ తగిలిస్తే మరో లోకంలోకి వెళ్ళినట్లే భావన కలుగుతుందన్నారు. పిల్లలకు ఇంజెక్షన్ చేసే ముందు లేదా కాన్యులా పెట్టే ముందు ఈ ఎక్స్‌ఆర్ (ఎక్స్‌టెండెడ్ రియాలిటీ) హెడ్‌సెట్ తగిలిస్తే ఎక్కడో మైదానంలో ఆడుకుంటున్నట్లు కనిపిస్తుందని సులభంగా ఇంజెక్షన్ చేయవచ్చని, కాన్యులా పెట్టవచ్చని వివరించారు. ఈ సదస్సులో కిమ్స్ ఆస్పత్రి మెడికల్ ఎడ్యుకేషన్, అకడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ మణిమాలారావు, ఆస్పత్రి క్లస్టర్ హెడ్ కిషోర్‌రెడ్డి, నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, న్యూఢిల్లీ గంగారం ఆస్పత్రి పెయిన్ రిలీఫ్ యూనిట్ డైరెక్టర్, పెయిన్ మెడిసిన్ అధ్యుడు డాక్టర్ ప్రదీప్ జైన్, డాక్టర్ మురళీధర్ జోషి, నిమ్స్ అనస్థీషియా విభాగం అదనపు డైరెక్టర్ డాక్టర ఆఖ్యకుమార్‌కర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 160 మంది వైద్యులు పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి




అలయ్ బలయ్‌లో పాల్గొన్న కార్తీక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి కార్తీక్‌రెడ్డి

మణికొండ: రాష్ట్రంలో ప్రతి పండగకూ ఓ సంస్కృతి, సంప్రదాయం ఉందని వాటిని భావితరాలకు అందేలా సంరక్షిస్తూ కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ ప్రొఫెసర్ జయశంకర్‌పార్క్‌లో వీఆర్ 4 సహాయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా అలయ్, బలయ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దసరా పండగ తరువాత బంధు, మిత్రులంతా కలసి ఒక చోట చేరి పండగ శుభాకాంక్షలు తెలుపుకుని యోగ క్షేమాలను తెలుసుకునేలా అలయ్, బలయ్‌ని నిర్వహించే వారన్నారు. ఇలాంటి సంప్రదాయాలను కాపాడుకునేలా మణికొండలో కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. ఇతరులవి నేర్చుకోవటంతో పాటు మన సంప్రదాయాలను కొనసాగించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు ఎ.లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు జి.నరేందర్, బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, షేక్ ఆరిఫ్, మాల్యాద్రి నాయుడు, శ్రీకాంత్, దిలీప్‌కక్కడ్, సమనళిని, దస్తగిర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

స్థానిక ఎన్నికల్లో లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కలసి పోటీ

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

శంషాబాద్: స్థానిక సంస్థలకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పోటీ చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఓ హోటల్‌లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మతతత్వ శక్తులను ఓడించడమే ప్రధాన అజెండాగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తున్న సీపీఐకి గ్రామాల్లో మంచి ఆదరణ ఉంటుందన్నారు. పోరాటాలే అస్త్రంగా చేసుకుని ప్రజాసమస్యల పరిష్కారంలో సీపీఐ ముందు వరసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, రామస్వామి, యాదయ్య, జంగయ్య, రామకృష్ణ, సత్యనారాయణ, పల్మాటి యాదయ్య, నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- పేరుకుపోతున్న చెత్త వ్యర్థాలు
- అధ్వానంగా అత్తాపూర్ పార్కు ప్రహరీ

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి పరిసరాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికంగా జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన పార్కు పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా తయారవుతోంది. జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరిన కంపౌండ్ వాల్ బేస్మెంట్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పార్కు సమీపంలోనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతాన్ని డంపింగ్ కేంద్రంగా మార్చివేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాలు పిచ్చి మొక్కలు పెరిగి భయానక వాతావరణం నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏడాదిగా పరిస్థితి ఇలాగే ఉంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో స్పందించి యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వాన స్థితికి చేరిన పార్కు ప్రహరీ



పార్కు ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డంప్ చేసిన చెత్త

వేలంపాటలో అమ్మవారి పట్టు చీరకు రికార్డు స్థాయి ధర

- రూ. 4.75 లక్షలకు దక్కించుకున్న కొండా కవిత వెంకటేష్ దంపతులు
- పద్మశాలీపురం జైమాతాది యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేలం పాట



వేలం పాటలో అమ్మ వారి చీరను దక్కించుకున్న దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మైలార్‌దేవ్‌పల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలీపురంలోని భూలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారికి అలంకరించిన పట్టు చీర వేలంపాట పోటాపోటీగా కొనసాగుతోంది. గడచిన 24 సంవత్సరాలుగా అమ్మవారి చీరను ఎలాగైనా పొందాలని భక్తులు వేలం పాటలో పోటీపడుతుంటారు.

- నవరాత్రి ఉత్సవాలలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహానికి భక్తులు చీరను అలంకరిస్తారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు తదితర పూజలు నిర్వహిస్తారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్లే సమయంలో జైమాతాది యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరను వేలం వేస్తారు. ఇక్కడ తొమ్మిది రోజులు పూజలందుకున్న అమ్మవారి పట్టు చీరను దక్కించుకోవడానికి భక్తులు పోటీ పడుతుంటారు. ఆ చీరను దక్కించుకున్నవారికి అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భక్తుల విశ్వాసం. పట్టుచీరను కొన్నవారికి ఆ సంవత్సరంలో అంతా మంచి జరుగుతుందనే నమ్మకం. 2002వ సంవత్సరంలో మొదటిసారి ఓ భక్తుడు రూ. 500కు వేలంలో చీరను తీసుకున్నాడు. 2002 నుంచి 2017వ సంవత్సరం వరకు వేలల్లో పలికిన అమ్మవారి చీర 2018 నుంచి 2024 వరకు రూ. లక్షలలో పలుకుతోంది. గత సంవత్సరం రూ. 3.79 లక్షలకు పద్మశాలీపురానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గంజి లాలీశ్వర్ దక్కించుకున్నారు.
- శుక్రవారం రాత్రి అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి నిమజ్జన కార్యక్రమం పద్మశాలీపురం నుంచి సోమశిలలో నిమజ్జనానికి తరలి వెళ్లే క్రమంలో నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారి పట్టు చీరను వేలం వేస్తారు. వేలం పాట కొండా కవితా వెంకటేష్ దంపతులు, సంకూరి జయప్రకాష్ దంపతుల మధ్య పోటాపోటీగా సాగింది వేలం పాటలో కవిత రూ. 4.75 లక్షలకు పాడి అమ్మవారి పట్టుచీరను సొంతం చేసుకున్నారు. గడచిన 24 సంవత్సరాలలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఎక్కడా ఇంత భారీ మొత్తంలో అమ్మవారి చీరకు వేలం పాట జరగలేదు. రికార్డు స్థాయిలో ధర పలకడం ఇదే మొదటి సారి అని నిర్వాహకులు తెలిపారు.